ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
శనివారం 29 జూన్ 2024

సొంతింటి కల కోసం నిరీక్షణ

- ఇందిరమ్మ ఇళ్లకు 1.10 లక్షల దరఖాస్తులు
- కాంగ్రెస్ సర్కారుపై పేదల ఆశలు
- నిర్మాణ దశలో వెక్కిరిస్తున్న 702 డబుల్ బెడ్‌రూం ఇళ్లు
- 6,886 ఇళ్లు మంజూరు
- పంపిణీకి సిద్ధంగా ఉన్నవాటికి మోక్షమెప్పుడో



వేములవాడలో నిలిచిపోయిన నిర్మాణాలు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

గూడు లేని పేదలు సొంతింటి కల కోసం నిరీక్షిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల మంజూరులో రాజన్న సిరిసిల్ల జిల్లాలో సగం కూడా అందించలేకపోయారు. మరికొన్ని నిర్మాణ దశలోనే నిలిచిపోయాయి. పూర్తయిన డబుల్ బెడ్‌రూం ఇళ్లలో కొన్ని పంపిణీకి నోచుకోలేదు. ప్రభుత్వం మారడంతో డబుల్ బెడ్‌రూం ఇళ్ల పరిస్థితి అయోమయంగా మారిపోయింది. కొత్త ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తులు ఆహ్వానించగా జిల్లాలోని పేదలు పెద్దఎత్తున దరఖాస్తులు చేసుకున్నారు. పాత ప్రభుత్వంలో మిగిలిపోయిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు, కొత్త ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం పేద ప్రజలు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు.

నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు ...

ఇళ్లులేని నిరుపేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆశలు కల్పించింది. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల కాలంలో కేవలం 3,546 డబుల్ బెడ్‌రూం ఇళ్లను మాత్రమే పూర్తి చేసింది. కొన్ని అసంతృప్తిగానే నిర్మాణ దశలోనే మిగిలిపోయాయి. పంపిణీ చేసిన ఇళ్లలోని నిర్మాణాల్లో డొల్లతనం బయటపడింది. చిన్నపాటి వర్షానికే ఊరవడం వంటి పరిస్థితులు ఉన్నాయి. కొన్నిచోట్ల నీటి సమస్యలు, డ్రైనేజీ సమస్యలు కూడా తలెత్తాయి. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇళ్లులేని నిరుపేదలకు సొంతింటి కల నేరవేర్చే దిశగా దరఖాస్తులను స్వీకరించింది.

జిల్లాలో ఆరు గ్యారంటీలకు 1,92,617 మంది దరఖాస్తులు చేసుకోగా ఇందులో ఇందిరమ్మ ఇళ్లకు 1,10,198 మంది దరఖాస్తులు చేసుకున్నారు. 338 మంది ఇంటి స్థలాల కోసం అమరవీరుల కుటుంబాలు, 2130 మంది తెలంగాణ ఉద్యమకారులు దరఖాస్తులు చేసుకున్నారు. దీంతో పాటు సొంత స్థలం ఉన్న బలహీన వర్గాలకు ఇందిర మ్మ ఇంటి నిర్మాణం కోసం ఐదు లక్షల రూపాయలు ఇస్తామని ప్రకటించారు. పార్లమెంట్ ఎన్నికలకు ముందు భద్రాచలంలో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. ప్రతీ నియోజక వర్గానికి 3,500 ఇళ్లు కేటాయించారు. దీంతో పేద ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం వైపు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు.

అసంపూర్తిగా డబుల్ ఇళ్ల నిర్మాణాలు..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 12 మండలాలు, సిరిసిల్ల, వేములవాడ రెండు మున్సిపాలిటీలకు సంబంధించి 6,886 డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేశారు. ఇందుకోసం 374.41 కోట్ల రూపాయలు వ్యయంగా నిర్ణయించారు. ఇందులో 5,437 ఇళ్లకు మాత్రమే టెండర్ ప్రక్రియ పూర్తి చేశారు. 4,248 ఇళ్ల నిర్మాణాలు చేపట్టి 3,546 ఇళ్లు పూర్తి చేశారు. ఇందులో 3,448 ఇళ్లను లబ్ధిదారులకు అందించారు. రూ 188.49 కోట్లు ఖర్చు చేశారు. 702 ఇళ్లు నిర్మాణ దశలోనే ఆగిపోయాయి. కొన్ని ఇళ్లు దాదాపు పూర్తయినా మౌలిక సదుపాయాలు లేక పంపిణీకి నోచుకోవ డం లేదు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోనూ ఇళ్ల నిర్మాణాలు పూర్తయిన అనేక వివాదాల మధ్య అందించడం లేదు. పూర్తయిన ఇళ్లు కేటాయింపులకు నోచుకోక శిథిలావస్థకు చేరుకోవడమే కాకుండా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది.

జిల్లాలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాల్లో సిరిసిల్ల మండలంలో 2,052 ఇళ్ల లక్ష్యాన్ని పూర్తి చేశారు. ముస్తాబాద్‌లో 702 ఇళ్లకు 429, తంగళ్లపల్లిలో 549 ఇళ్లకు 110, ఎల్లారెడ్డిపేటలో 490 ఇళ్లకు 320, గంభీ రావుపేటలో 476 ఇళ్లకు 371, వీర్నపల్లిలో 160 ఇళ్లు మంజూరు కాగా 50 ఇళ్ల నిర్మాణం ప్రారంభించి ఒకటి కూడా పూర్తి కాలేదు. ఇల్లంత కుంటలో 340 ఇళ్లకు 184 పూర్తి చేశారు. వేములవాడ రూరల్ మండ లంలో 1,080 ఇళ్లకు 80 ఇళ్లు పూర్తికాగా వేములవాడ అర్బన్‌లో 800 ఇళ్లకు ఇప్పటి వరకు ఒకటి కూడా పూర్తి కాలేదు.

కోనరావుపేట మండలంలో 92, చందుర్తిలో 45, రుద్రంగిలో 35 ఇళ్లు, బోయినపల్లిలో 65 ఇళ్లు మంజూరైనా ఇప్పటి వరకు నిర్మాణాలు ప్రారంభం కాకుండానే లబ్ధిదారుల్లో నిరాశ నింపింది. ప్రధానంగా వేములవాడ నియోజకవర్గంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం పూర్తిగా నిరాశనే కల్పించింది. గత ప్రభుత్వంలో ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతోనే సగం కూడా పూర్తి కాలేదనే విమర్శలు ఉన్నాయి. ప్రస్తుతం మంజూరైన ఇళ్లలో ఇప్పటివరకు ప్రారంభం కానీ ముస్తాబాద్‌లో 175 ఇళ్లు, తంగళ్లపల్లిలో 178, ఎల్లారెడ్డిపేటలో 106, గంభీరావుపేటలో 43, వీర్నపల్లిలో 87, ఇల్లంతకుంటలో 156, వేములవాడ రూరల్‌లో 1000, వేములవాడ అర్బన్‌లో 656, కోనరావుపేటలో 92, చందుర్తిలో 45, రుద్రంగిలో 35, బోయినపల్లిలో 65 ఇళ్లకు టెండర్లు పూర్తయ్యాయి. కొత్త ప్రభుత్వం ఇప్పటి వరకు డబుల్ బెడ్‌రూం ఇళ్లపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిరుపయోగంగా వెక్కిరిస్తుండగా దరఖాస్తులు చేసుకున్న వారు ఇళ్ల కేటాయింపు కోసం ఎదురు చూస్తున్నారు.



ఇల్లంతకుంటలో చివరి దశలో ఉన్న ఇళ్ల నిర్మాణాలు

నేడు మండలపరిషత్ సమావేశం

ఇల్లంతకుంట, జూన్ 28: మండలపరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఉంటుందని ఎంపీడీవో శ్రీనివాస మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశానికి అన్ని గ్రామాల ఎంపీటీసీలు హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తారని రెవన్యూ అధికారులు తెలిపారు.

నేడు ముత్యాల పోచమ్మ ఆలయ ఆవరణలో బహిరంగ వేలం

ఇల్లంతకుంట, జూన్ 28: మండలంలోని అనంతగిరి గ్రామంలోని ముత్యాల పోచమ్మ ఆలయ ప్రాంగణంలో ప్రసాదం అమ్మక హక్కుల కోసం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఈవో మారుతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. సంవత్సర కాలం పాటు లడ్డు , పులిహోర, కొబ్బరి ముక్కలు పోగుచేయడానికి వేలం పాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తికలిగిన వారు వేలంపాటలో పాల్గొనాలని ఈవో కోరారు.

వృద్ధాశ్రమాన్ని సందర్శించిన కలెక్టర్

- వృద్ధుల ఆరోగ్యంపై ఆరా
- సరుకులు, స్టోర్ రూం పరిశీలన




వృద్ధాశ్రమంలో వృద్ధుడితో, పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

తంగళ్లపల్లి, జూన్ 28: ఆరోగ్యం ఎలా ఉంది.. ఆశ్రమంలో సౌకర్యాలు.. భోజన వసతులు ఎలా ఉన్నాయని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వృద్ధులను ఆరా తీశారు. శుక్రవారం తంగళ్లపల్లి మండలం మండెపల్లి గ్రామ శివారులోని ప్రభుత్వ వృద్ధాశ్రమాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఆశ్రమంలోని వంటగది, స్టోర్ రూం, డైనింగ్ హాల్‌లను పరిశీలించారు. అనంతరం వృద్ధులతో ఆప్యాయంగా మాట్లాడారు. ఏమైన ఇబ్బందులు ఉన్నాయా తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. వృద్ధులు నడిచేందుకు ఉపాధిహామీ పథకంలో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సరుకులు, స్టోర్ రూంలను పరిశీలించి రికార్డులను కలెక్టర్ తనిఖీ చేశారు.

● అంగన్‌వాడీ సెంటర్ పరిశీలన..

మండలంలోని బద్దనపల్లిలో అంగన్‌వాడీ సెంటర్‌ను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పరిశీలించారు. ఈ సందర్భంగా పిల్లల హాజరు తదితర అంశాలను తనిఖీ చేశారు. వంట గదిని పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. అంగన్‌వాడీ సెంటర్‌లో పిల్లల బరువును పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ పాఠశాలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, సీడీపీవో ఆలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

● ఈవీఎం గోదాం తనిఖీ

సిరిసిల్ల కలెక్టరేట్: సిరిసిల్ల మున్సిపాలిటీ పరిధిలోని సర్దాపూర్ ఈవీఎం గోదామును కలెక్టర్ సందీప్ కుమార్ ఝా శుక్రవారం తనిఖీ చేశారు. సాధారణ తనిఖీల్లో భాగంగా కలెక్టర్ పరిశీలించి, రిజిస్టర్‌లో సంతకం చేసి అధికారులకు, భద్రతా సిబ్బందికి పలు సూచనలు చేశారు. తనిఖీలో భాగంగా సిరిసిల్ల ఆర్డీవో రమేష్, , తహసీల్దార్ షరీఫ్, ఎన్నికల విభాగం అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రాజన్న గోశాలకు రూ. 1.11 కోట్ల నిధులు మంజూరు



విధు శేఖర భారతి స్వామివారి ఆశీర్వదం తీసుకుంటున్న ప్రభుత్వ విప్



దేవాదాయశాఖ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్ (ఫైల్)

వేములవాడ కల్చరల్, జూన్ 28: వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి గోశాలలోని గోవుల సంరక్షణ, అభివృద్ధి పనులు వెంటనే చేపట్టే విధంగా రూ. ఒక కోటి 11 లక్షలను విడుదల చేస్తూ దేవాదాయశాఖ కమిషనర్ శుక్రవారం ఉత్తర్వులను విడుదల చేశారు. గోశాలను ఐదు రోజుల క్రితం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఆలయ ఈవో రామకృష్ణతో కలిసి పరిశీలించారు. గోశాలలో వున్న 15 వందల వరకు కోడెల దీన స్థితిని చూసిన ప్రభుత్వ విప్ చలించిపోయారు. వెంటనే దేవాదాయశాఖ కమిషనర్‌కు ఫోన్ ద్వారా మాట్లాడి వెంటనే నిధులు మంజూరు చేయాల్సిందిగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కోరారు. ఈ సందర్భంగా స్పందించిన దేవాదాయశాఖ కమిషనర్ గోశాలలోని గోవుల సంరక్షణ, అభివృద్ధి పనులు వెంటనే చేపట్టే విధంగా యుద్ధప్రతిపాధికన రూ. ఒక కోటి 11 లక్షలను విడుదల చేస్తూ ఉత్తర్వులను విడుదల చేశారు. గోశాలలో డ్రైనేజీ నిర్మాణం చేయుటకు రూ. 18 లక్షలు, వీసీసీ ఫ్లోరింగ్ చేసేందుకు రూ. 43 లక్షలు, రెండు షెడ్లు నిర్మాణము చేసేందుకు రూ. 50 లక్షల నిధులను విడుదల చేస్తూ ఉత్తర్వులు వచ్చినట్లు ఆలయ ఈవో రామకృష్ణ పేర్కొన్నారు.

● శృంగేరీ శారదాపీఠాన్ని దర్శించుకున్న ప్రభుత్వ విప్

వేములవాడ కల్చరల్: కర్నాటకలోని శృంగేరీ శారదాపీఠంలోని అమ్మవారిని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ శుక్రవారం దర్శించుకున్నారు. అమ్మవారికి సువర్ణ పుష్పాలతో సేవ నిర్వహించారు. అమ్మవార కృపకటాక్షాలతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. అనంతరం శృంగేరీ శారదాపీఠం పీఠాధిపతి జగద్గురు విధు శేఖర్‌భారతి స్వాముల వారిని దర్శించుకుని, పాదపూజ నిర్వహించి, ఫలాలను సమర్పించి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా వేములవాడ దేవస్థానం అభివృద్ధి కోసం జగద్గురు పలు సూచనలు, సలహాలు చేసినట్లు తెలిపారు. త్వరలోనే రాజన్న క్షేత్రానికి వచ్చి శ్రీస్వామి వారిని దర్శించుకోవాల్సిందిగా కోరినట్లు పేర్కొన్నారు.

రామచంద్రస్వామి వ్యవసాయ భూమికి వేలం

వేములవాడ కల్చరల్, జూన్ 28: వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి అనుబంధ ఆలయమైన కోనరావుపేట మండలం మామిడిపల్లి సీతారామచంద్ర స్వామి వారి ఆలయ వ్యవసాయ భూమిని శుక్రవారం వేలపాట నిర్వహించారు. ఆలయ గెస్టహౌస్ సమావేశ మందిరంలో ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్ నేతృత్వంలో టెండర్‌ను నిర్వహించారు. టెండర్ హక్కులను దక్కించుకునేందుకు రైతులు హాజరయ్యారు. మామిడిపల్లి గ్రామంలోని ఎకరం ఆరు గుంటల స్థలానికి రెండు సంవత్సరాల లీజు హక్కుల కోసం రమేష్ అనే వ్యక్తి రూ. 25,500లకు టెండర్ దక్కించుకున్నట్లు తెలిపారు. రెండు సంవత్సరాలకు గాను 22 వేల వున్న వేలంను ప్రస్తుతం రూ 25 వేల 500లకు దక్కించుకున్నట్లు పేర్కొన్నారు. వేలం పాటలో సూపరింటెండెంట్ సిరిగిరి శ్రీరాములు, అధికారులు సత్యనారాయణ, నరేందర్ తదితరులు ఉన్నారు.



వేలం పాట నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

రాజన్న ఆలయంలో ప్రత్యేక పూజలు

వేములవాడ కల్చరల్, జూన్ 28: వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులు సంకల్పపూజ, అభిషేకపూజ, అన్నపూజ, స్వామివారి కల్యాణపూజలో పాల్గొన్నారు. శుక్రవారం రోజున రాహుకాలంను పురస్కరించుకుని మహిసాసురమర్ధిని అమ్మవారి ఆలయం ముందు భక్తులు చేరుకుని దీపాలను వెలిగిం చారు. దోషాలు తొలగిపోవాలని అమ్మవారిని వేడుకున్నా రు.

ఎల్‌వోసీ అందజేత

బోయినపల్లి, జూన్ 28: మండలంలోని కొదురుపాకకు చెందిన పెంజర్ల దేవరాజు అనే వ్యక్తికి రూ 1.30 లక్షల ఎల్‌వోసీ మంజూరు పత్రాన్ని మండల కాంగ్రెస్ నాయకులు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, మాజీ జడ్పీటీసీ పులి లక్ష్మీపతిగౌడ్, ఎంపీటీసీ ఉయ్యాల శ్రీనివాస్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

గంజాయి సేవించి జీవితాలను నాశనం చేసుకోవద్దు

- ఎస్పీ అఖిల్ మహాజన్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

సిరిసిల్ల క్రైం, జూన్ 28: గంజాయి సేవించి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శుక్రవారం సిరిసిల్ల టౌన్, సిరిసిల్ల రూరల్ పరిధిలో గంజాయి సేవిస్తూ పట్టుబడిన వారికి వారి తల్లదండ్రుల సమక్షంలో ఎస్పీ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత డ్రగ్స్, గంజాయి లాంటి మత్తు పదార్థాలకు బానిసలై వారి భవిష్యత్తుని నాశనం చేసుకోవద్దనే ఉద్దేశంతో ఈ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. దేశ భవిష్యత్తును నిర్ణయించేది యువతనేనని, మత్తు పదార్థాలకు బానిసలై ఆరోగ్య సమస్యలు తలెత్తడమే కాకుండా నేరాలు చేసే అవకాశం ఉందన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడి ఏదైనా నేరం చేసినట్లయితే ఎలాంటి ఉద్యోగం రాదన్నారు. ఉపాధి కోసం విదేశాలకు వెళ్లలేరని ఆయన అన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల బారినపడిన యువకులు మంచి మార్గంలో నడుచుకోవడానికి కౌన్సెలింగ్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. చెడు వ్యసనాలను దూరం చేసుకొని మంచి ప్రవర్తనతో మెలగాలని, లేని పక్షంలో కఠినంగా వ్యవహరిస్తామన్నారు. గంజాయికి అలవాటు పడి మానుకోలేని పరిస్థితి ఉన్న వారికి జిల్లాలో ఏర్పాటుచేసిన డి అడిక్షన్ సెంటర్‌లో సైకాలజిస్ట్, సైకియాట్రిస్ట్‌లతో కౌన్సిలింగ్ ఇప్పించి వైద్య సదుపాయలు అందజేస్తామన్నారు. ఎవరైనా గంజాయికి అలవాటుపడిన వారు ఉంటే వారి వివరాలు తెలియజేయాలని ఎస్పీ అన్నారు. గంజాయి అక్రమరవాణాకు పాల్పడడం, మత్తుపదార్థాల వినియోగించే వారిని ప్రోత్సహిస్తే కఠిన చర్యలు తీసుచకుంటామని ఎస్పీ హెచ్చరించారు. కార్యక్రమంలో సిరిసిల్ల డిఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, టౌన్ సీఐ రఘుపతి, రూరల్ సీఐ సదన్‌కుమార్, ఎస్ఐ మల్లేశం పాల్గొన్నారు.

పీవీ నర్సింహారావు సేవలు మరవలేనివి

- ఘనంగా మాజీ ప్రధాని జయంతి వేడుకలు
- నివాళులర్పించిన కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు

8



సిరిసిల్లలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

గంజాయి విక్రయిస్తున్న నలుగురి అరెస్ట్

- నాలుగు కిలోల 700గ్రాముల గంజాయి స్వాధీనం

6

దోమల నివారణకు పకడ్బందీ చర్యలు



మాట్లాడుతున్న మండల వైద్యాధికారి డాక్టర్ స్రవంతి

వీర్నపల్లి, జూన్ 28: వర్షాకాలంలో దోమలు విజృంభించకుండా ఉండేందుకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నామని మండల వైద్యాధికారిని డాక్టర్ స్రవంతి అన్నారు. వీర్నపల్లి మండలం కంచర్లలో గతంలో విషజ్వరాలు ప్రబలడంతో వైద్య సిబ్బందితో ముందస్తు చర్యలు చేపట్టారు. దోమల నివారణ కోసం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాల మేరకు ప్రతీ మంగళవారం, శుక్రవారం డ్రై డే నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో సిబ్బందితో కలిసి ఇంటింటా తిరుగుతూ ఇండోర్ రెసిజ్వల్ స్ప్రే చేయించారు. గ్రామంలో ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. నీటి గుంతలు ఉన్నచోట ఆయిల్ బాల్స్ వదులుతున్నట్లు పేర్కొన్నారు. గ్రామంలో ప్రతీ ఒక్కరి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఈవో లింగం, సబ్ యూనిట్ ఆఫీసర్ మోహన్, మండల ఇన్‌చార్జి డాక్టర్ చిరంజీవి, సూపర్‌వైజర్ పద్మ, ఏఎన్ఎం రుతమ్మ, ఆశావర్కర్లు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు

స్పోర్ట్స్ స్కూల్‌లో జిల్లా స్థాయి ఎంపిక పోటీలకు స్పందన



పరుగు పందెంలో పోటీ పడుతున్న విద్యార్థులు

సిరిసిల్ల టౌన్, జూన్ 28: సిరిసిల్ల పట్టణం మినీ స్టేడియంలో శుక్రవారం జిల్లా యువజన, క్రీడాశాఖ ఆధ్వర్యంలో తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్స్ విద్యార్థుల (బాలబాలికలు) జిల్లా స్థాయి ఎంపిక పోటీలు జరగాయి. 2024-25 విద్యా సంవత్సరానికి గాను జిల్లా స్థాయి ఎంపిక పోటీలకు విద్యార్థుల నుంచి స్పందన వచ్చింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యార్థులకు ఎంపిక క్రీడా పోటీలను నిర్వహించగా ఉత్సాహంగా పాల్గొన్నారు. జిల్లాస్థాయి ఎంపిక పోటీలో మొత్తం 50 మంది విద్యార్థులు పాల్గొనగా అందులో బాలురు 33 మంది, బాలికలు 17 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా యువజన క్రీడ శాఖ అధికారి అజ్మీరా రాందాస్ మాట్లాడుతూ జిల్లాస్థాయి ఎంపిక పోటీలలో ప్రతిభ కనబరిచిన బాలబాలికలు జూలై 7న హైదరాబాద్ హకీంపేట్ స్పోర్ట్స్ స్కూల్‌లో రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటారన్నారు. రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీలలో ప్రతిభ కనబరిచిన బాలబాలికలు కరీంనగర్, ఆదిలాబాద్, హకీంపేట్ స్పోర్ట్స్ స్కూల్స్‌లో ప్రవేశం అర్హత సాధిసారని వివరించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అడుగుకో గుంత

- అవస్థలు పడుతున్న ప్రయాణికులు
- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

వీణవంక, జూన్ 28: మండలంలోని చల్లూరు నుంచి మాల్లారెడ్డిపల్లికి వెళ్లే రోడ్డు పూర్తిగా దెబ్బతిని గుంతలుపడ్డాయి. ఓ వైపులు గుంతలు, మరోవైపు కంకర తేల డంతో ఈ రోడ్డుపై ప్రయాణించడానికి ప్రజలు


గుంతల్లో నిలిచిన వర్షం నీరు


గుంతలు పడిన రోడ్డు

తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతీ గ్రామానికి తారురోడ్డు నిర్మి స్తామని పాలకులు చెబుతున్నా అధికారులు మరమ్మతు లు చేపట్టడంలో అలసత్వం ప్రదర్శించడడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రు. ఇటీవల మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గుంతల్లో నీరు చేర డంతో అవి ఎంత లోతు ఉన్నాయో తెలువక వాహనదారులు అదుపు తప్పి పడిపోతున్నారు. రాత్రి సమయంలో అత్యవసరమైన పనుల పై వెళ్లే వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. గతంలో ఈ ప్రాంతంలో గ్రానైట్, ఇసుక క్వారీలకు అనుమతులు ఇవ్వ డంతో లారీలు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగించాయి. లారీల్లో పరిమితికి మించి సామగ్రి తరలించడం వల్ల రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

బీడీ కార్మికులకు పెరిగిన కూలీని అందించాలి



మాట్లాడుతున్న మూషం రమేష్

సిరిసిల్ల రూరల్, జూన్ 28: బీడీ కార్మికులకు పెరిగిన రూ 249.99 పైసలను మే 1వ తేదీ నుంచి అందించడంతో పాటు తక్కువ కూలీ చెల్లిస్తు న్న బీడీ కంపెనీల యజమానులపై అధి కారులు చర్యలు తీసుకోవాలని సీఐటీ యూ బీడీ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు మూషం రమేష్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం బీడి వర్కర్స్ యూనియన్ సమావేశంలో గౌరవ అధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ జూలై 5 నుంచి రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా బీడి వర్కర్స్ బస్తీ కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. కార్మిక సంఘాల ఐక్య పోరాటాల ఫలితంగా బీడి కార్మికులు ప్యాకర్లు, నెలవారీ ఉద్యోగులకు వేతనాలు పెరిగాయన్నారు. కొన్ని కార్మిక సంఘాలు తమ వ్యక్తిగత ప్రయోజనం కోసం మేమే వేతనాలు పెంచామని కార్మికులను మభ్య పెడుతున్నారన్నారు. అలాంటి వారి మాటలను కార్మికులు నమ్మవద్దని గుర్తింపు పొందిన సంఘాల ఐక్య పోరాటం ఫలితంగానే వేతనాలను యజమానులు పెంచార న్నారు. పెంచిన వేతనాలను మే 1 నుంచి అమలవుతున్నాయని జూన్ నెల వచ్చే వేతనం కార్మికులందరికీ పెంచిన వేతనాన్ని ఇవ్వాలన్నారు. వెయ్యి బీడీలకు రూ 249.99 పైసలను బీడి కార్మి కులకు ప్యాకర్లకు నెలకు రూ. 3,650, నెలవారీ ఉద్యోగులకు రూ. 1,700 చొప్పున పెరిగిన జీతంను యజమాన్యాలు అందించాలని కోరారు. సమా వేశంలో బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు గోవింద లక్ష్మణ్, జిల్లా నాయకులు సూరం పద్మ, బెజుగం సురేష్, తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్లు జైలు

శంకరపట్నం, జూన్ 28: పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు 10వేల రూపాయల జరిమానా విధిస్తూ జిల్లా స్పెషల్ ఫాస్ట్ ట్రాక్ కోర్టు న్యాయమూర్తి డి వెంకటేష్ శుక్రవారం తీర్పు ఇచ్చారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకరపట్నం మండలంలోని మెట్‌పల్లి గ్రామంలో ఒంగోలు జిల్లాలోని సంతనూతలపాడు మండలం చిలకపాడు గ్రామానికి చెందిన దాసరి అంజి మేస్త్రీ పని చేస్తూ ఒంటరిగా ఒక ఇంట్లో కిరాయికి ఉండేవాడు. అంజి దగ్గరికి ఓ బాలిక కూలీ పనికి వెళ్లేది. ఈ పరిచయడంతో ఆమెను పెళ్లి చేసుకుంటానని తన వెంట సొంత గ్రామమైన చిలకపాడుకు తీసుకెళ్లాడు. కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి బాలికను ఇంటికి తీసుకు వచ్చారు. అనంతరం నవంబరు 28, 2016న కుటుంబ సభ్యులు పనికి వెళ్లాగా బాలికకు అనారోగ్యంగా ఉండడం తో ఆమెను ఇంటి వద్దే ఉంచారు. కూలీ పనికి వెళ్లిన తల్లిదండ్రులు ఇంటికి వచ్చి చూడగా కూతురు ఇంట్లో కనిపించ లేదు. కుటుంబ సభ్యులు గ్రామంలో బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో అంజి సొంతూరు చిలకపా డుకు వెళ్లి ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. ఈ మేరకు అంజిని కోర్టులో హాజరు పరిచారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన ప్రత్యేక పాస్ట్ ట్రాక్ కోర్టు పోక్సో న్యాయ మూర్తి డి వెంకటేష్ నిందితుడిపై నేరం రుజువు కావడంతో 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు 10వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

గంజాయి విక్రయిస్తున్న నలుగురి అరెస్టు

- నాలుగు కిలోల గంజాయి స్వాధీనం
- 30 గ్రాముల చాక్‌లెట్స్ సీజ్


మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్


సిరిసిల్ల క్రైం, జూన్ 28: జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ కేంద్రాలుగా గంజాయి విక్రయిస్తున్న నలుగురిని అరెస్ట్‌చేసి వారి వద్ద నాలుగు కిలోల 700గ్రాముల గంజాయిని, మరో 30 గ్రాముల గంజాయి చాక్‌లెట్స్‌ను, నాలుగు మొబైల్స్, రెండు బ్యాగులు, రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు, మరో ఇద్దరు గంజాయి విక్రేతలు పరారీలో ఉన్నారని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం సిరిసిల్ల టౌన్ పోలీస్ స్టేషన్‌లో నలుగురు గంజాయి విక్రేతలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన వివరాలు వెల్లడించారు. ఇందులో పెద్దపల్లి జిల్లాలోని పెద్దబొంకూరు గ్రామానికి చెందిన కలవేన ప్రవీణ్‌కుమార్ (22), సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన పెరుక వెంకటేశ్ (19), మంచిర్యాల జిల్లా మదురానగర్‌కు చెందిన నార్ల అక్షయ్ (18), హైదరాబాద్‌లోని రాంనగర్‌కు చెందిన అలెగ్జెండర్ జోసెఫ్ (43)ను అరెస్ట్‌చేశామన్నారు. పెద్దపల్లి జిల్లాలోని అమర్‌నగర్ కు చెందిన బండి సాయిచరణ్ (21), కరీంనగర్ జిల్లాలోని సుస్తులాపూర్ గ్రామానికి చెందిన మీస సాయిరామ్ (19)లు పరారీలో ఉన్నారని తెలిపారు. కలవేన ప్రవీణ్ అనే వ్యక్తి ఓ ఆసుపత్రిలో నర్సింగ్ కోర్సు చేస్తు కరీంనగర్ జిల్లా బొమ్మకల్‌లో సాయిచరణ్, సాయి బిబ్బిలతో కలిసి రూమ్ అద్దెకు తీసుకున్నాడని తెలిపారు. సాయిచరణ్, ప్రవీణ్‌లు అక్షయ్‌కి తెలిసిన వ్యక్తి వద్ద భద్రాచలంలో గంజాయిని కొనుగోలుచేసి అద్దె గదిలో పెట్టుకొని ముగ్గురు కలిసి వేములవాడ, సిరిసిల్లలో ఫోన్స్ ద్వారా విక్రయిస్తున్నా రన్నారు. నాలుగు రోజుల క్రితం ప్రవీణ్, సాయిచరణ్ కలిసి ఓ తెలిసిన వ్యక్తి వద్ద గంజాయిని, గంజాయితో తయారుచేసిన చాక్లెట్స్‌ను కొనుగోలు చేశారు. వాటిని తీసుకొని శుక్రవారం సిరిసిల్లలోని కొత్తచెరువు వద్ద మకాం వేయగా, వెంకటేశ్, అక్షయ్, జోసెఫ్ చేరుకొని తెలిసిన వారిని గంజాయి, గంజాయి చాక్లెట్స్‌ను విక్రయిస్తున్నారని తెలిపారు. పక్కా సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకొని పట్టుకునేందుకు ప్రయత్నిస్తుండగా సాయి చరణ్, సాయి రాంలు గంజాయి, డబ్బులతో పరారయ్యారన్నారు. దీంతో అక్కడే ఉన్న మిగితా విక్రేతలైన ప్రవీణ్, వెంకటేశ్, అక్షయ్, జోసెఫ్‌లను పట్టుకుని వారి వద్ద నాలుగు కిలోల 700 గ్రాముల గంజాయిని, 30 గ్రాముల గంజాయి చాక్లెట్‌లను స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో సిరిసిల్ల డిఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, టౌన్ సిఐ రఘుపతి, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుల్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

2,19,038 క్వింటాళ్ల బియ్యం పక్కదారి

- మిల్లు యజమానులపై కేసు నమోదు

ఇల్లందకుంట/జమ్మికుంట జూన్ 28: జమ్మికుంట, ఇల్లందకుంటలోని సీతారామ పారా బాయిల్డ్, మహాశక్తి రైస్‌మిల్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజకుమార్ తెలిపారు. ఎస్ఐ రాజకుమార్ తెలిపిన వివరాల ప్రకారం సీతారామ రైస్‌మిల్ యజమానులకు 2022-23 నుంచి 2023-24 సంవత్సరానికి సంబంధించి సివిల్ సప్లయీ వాళ్ల 2,19,038.28 క్వింటాళ్ల వడ్లు మిల్లింగ్ చేయాలని అప్పగించారు. ప్రభుత్వానికి బియ్యం అప్పగించకపోవడం, మిల్‌లో ఉండాల్సిన వడ్లను, బియ్యం పట్టించి వేరే వైపు మళ్లించి ఎక్కువ ధరకు అమ్ముకున్నట్లు గురువారం అధికారులు చేపట్టిన తనిఖీలో నిర్ధారణ అయినట్లు తెలిపారు. అందుకు గాను ప్రభుత్వానికి రూ. 86.38లక్షల రూపాయల నష్టం కలిగించినట్లు సివిల్ సప్లయీ జిల్లా మేనేజర్ రజినీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిల్ యజమానులైన బండారు శారద, బండారు మారుతిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజకుమార్ తెలిపారు.

మూతపడ్డ పాఠశాలలు తెరుచుకునేదెప్పుడు?


రామబద్రునిపల్లి గ్రామంలో మూతపడ్డ పాఠశాల

పెగడపల్లి, జూన్ 28: మండలంలో మూతపడ్డ పాఠశాలలను తిరిగి తెరిపించేందుకు అధికారులు ప్రజా ప్రతినిధులు పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు. మండలంలోని లింగాపూర్ అనుబంధ గ్రామమైన ఉప్పుపల్లె , బతికెపల్లి అనుబంధ గ్రామమైన కొండయ్యపల్లి, రామబద్రునిపల్లి, రాజారాంపల్లి తండా పాఠశాలలు విద్యార్థులు లేరని మూతపడ్డాయి. ఉప్పుపల్లె, కొండయ్యపల్లె, రామబద్రునిపల్లి పాఠశాలలు రెండు, మూడేండ్లుగా తెరుచుకోక పోగా రాజారాంపల్లి తండా పాఠశాల సైతం గత సంవత్సరం మూసివేశారు. ఆయా పాఠశా లలకు పక్కా భవనాలు, టాయిలెట్లు, తాగునీటి వసతి లాంటి సకల సౌకర్యాలు స్నప్పటికి విద్యార్థులు లేరని మూతపడ్డ పాఠశాలలకు విద్యార్థులను రప్పించేందుకు అటు ఉపాధ్యాయులు, ఇటు ప్రజాప్రతినిదులు దృష్టి సారించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతు న్నాయి. రామబద్రునిపల్లి, రాజారాంపల్లి తండా పాఠశాలలకు ఒక్కో ఉపాధ్యాయుడు వస్తున్నట్లు చెబుతున్నప్పటికీ ఒక్క విద్యార్థి సైతం చేరలేదు. కొండయ్యపల్లి, ఉప్పుపల్లి పాఠశాలలకు ఉపాధ్యాయుల కేటాయింపు పాఠశాలలు తెరిచే ప్రయత్నం సైతం చేయడం లేదు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పదవి కాదు.. గౌరవం ముఖ్యం

- కేడీసీసీబీ చైర్మన్ రవీందర్‌రావు

కరీంనగర్ టౌన్, జూన్ 28: టెస్కాబ్ చైర్మన్ పదవి నుంచి తనను దించడం ఎవరితో సాధ్యం కాదని, తనకు పదవి కాదు.. గౌరవం ముఖ్యమని కేడీసీసీబీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు అన్నారు. కేడీసీసీబీ సమావేశమందిరంలో శుక్రవారం నిర్వహిచిన కేడీసీసీబీ మహాజనసభ సమావేశంలో ఆయన మాట్లాడారు. సహకార సంఘాలకు వన్నెతేవడమే కాకుండా దేశంలోని నాఫ్‌స్కాబ్ చైర్మన్‌గా వ్యవహరించిన కొండూరు రవీందర్‌రావుపై విశ్వాసం లేదంటూ పదవి నుంచి దించేందుకు అవిశ్వాస నోటీసు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండించారు. వారు చేసిన తప్పిదానికి వారు మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కేడీసీసీబీ, టెస్కాబ్, నాఫ్‌స్కాబ్ చైర్మన్‌గా సహకార రంగాల బలోపేతానికి చేసిన కృషి అభినందనీయమని, ఆయనకు రుణపడి ఉండాల్సి పోయి అవిశ్వాస లేఖ ఇవ్వడాన్ని, దానికి స్పందిస్తూ అవిశ్వాసానికి ముందే పదవికి కొండూరు రవీందర్‌రావు టెస్కాబ్ పదవిని రాజీనామా చేశారని అన్నారు. దీనికి కొండూరు రవీందర్‌రావు స్పందిస్తూ తనకు పదవి ముఖ్యం కాదని, గౌరవం కోసమే టెస్కాబ్ చైర్మన్ పదవికి రాజీనామా చేశాను... నాకు మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబుతోపాటు సీఎం రేవంత్ రెడ్డితో సహా ఇద్దరు మంత్రులు మినహా మిగిలిన వారంతా సన్నిహితులేనని, అయినా తాను పదవి కోసం ఆరాట పడకుండా రాజీనామా చేశానని అన్నారు. సమావేశంలో డీసీఎంఎస్ చైర్మన్ డాక్టర్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, కేడీసీసీబీ వైస్ చైర్మన్ పింగళి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కొండగట్టు అంజన్న సన్నిధిలో జ్యేష్ఠాభిషేకం

●108 కళశాలతో ప్రత్యేక పూజలు



కొండగట్టులో కళశ పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

మల్యాల, జూన్ 28: కొండగట్టు శ్రీఆంజనేయ స్వామి సన్నిధిలో శుక్రవారం జ్యేష్ఠాభిషేకం ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం 108 కళశాలతో స్వామి వారికి అభిషేకం చేశారు. ఈవో చంద్రశేఖర్, ఏఈవో అంజయ్య, ఆలయ స్థానాచార్యులు కపీంధర్ ప్రధాన అర్చకులు జితేంద్రప్రసాద్, రామకృష్ణ, రఘు, ఉపప్రధాన అర్చకులు చిరంజీవి, మారుతీ పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ, చంద్రశేఖర్ ఆలయ అధికారులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

11 లీటర్ల గుడుంబా పట్టివేత



పట్టుబడిన గుడుంబా

కరీంనగర్ క్రైం/చొప్పదండి, జూన్ 28: కరీంనగర్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ దాడుల్లో 11 లీటర్ల గుడుంబా పట్టుబడింది. కరీంనగర్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ కె నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం చొప్పదండి మండలం రాగంపేటలో దాడులు నిర్వహించారు. రాగంపేటకు చెందిన బాసరవేని శ్రీనివాస్ 11 లీటర్ల గుడుంబాతో పట్టుబడగా, ధర్మారం మండలం బంజ రుపల్లికి చెందిన ఇస్లావత్ కేవ్ల నాయక్ పరారీలో ఉన్నాడని సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ హెడ్‌కానిస్టేబుల్ మోసిన్, కానిస్టేబుళ్లు కుమార్ యాదవ్, ఖాసీంబీ, కమలాకర్, కమాలుద్దీన్, సంతోష్‌లు పాల్గొన్నారు.

జిల్లా జైలును సందర్శించిన ఐజీ



ఖైదీలతో మాట్లాడుతున్న ఐజీ మురళిబాబు

కరీంనగర్ క్రైం, జూన్ 28: కరీంనగర్ జిల్లా జైలును శుక్రవారం జైళ్లశాఖ ఐజీ మురళీబాబు సందర్శించారు. జైలులో ఖైదీల యోగక్షేమాలు, భోజన వసతులు, న్యాయసేవ, ఆరోగ్య సమస్యల గురించి ఖైదీలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం జైలులో క్యాంటిన్, ఆసుపత్రి, ములాఖత్, ఫోన్ సౌకర్యం, లైబ్రరీ, ఖైదీల టాయిలెట్ల శుభ్రత, వంటశాల, జైలులోని పరిశ్రమ పెట్రోల్‌బంక్‌లో పనితీరును తెలసుకుని అధికారులను అభినందించారు. జైలులోని గార్డెనింగ్, పరిశుభ్రత బాగుందని అభినందించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా జైలు సూపరింటెండెంట్ కె శ్రీనివాస్, వైద్య అధికారి కె వేణుగోపాల్, జైలర్ పి శ్రీనివాస్, బి రమేష్, డిప్యూటీ జైలర్ ఎ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ సుధాకర్‌రెడ్డి, ఎల్ రమేష్, ఎం సుధాకర్‌రెడ్డి, ఎస్ సంగీత సిబ్బంది పాల్గొన్నారు.

దోపిడీ దొంగల ముఠా అరెస్టు



మాట్లాడుతున్న డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు

మెట్‌పల్లి, జూన్, 28: మెట్‌పల్లి పట్టణంలో దోపిడీ దొంగల ముఠాను శుక్రవారం అరెస్టు చేసినట్లు డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు తెలిపారు. మెట్‌పల్లి డీఎస్పీ కార్యాలయంలో సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సై చిరంజీవిలతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. మహారాష్ట్రలోని కిన్వట్ జిల్లాకు చెందిన కరన్ మరిభా ధోత్రె, సురేష్ అశోక్ పవార్‌లు మెట్‌పల్లి పట్టణానికి చెందిన హనుమంత్ పవార్‌తో కలిసి ముఠాగా ఏర్పడి దొంగతనాలకు పాల్పడుతున్నారు. సీఐ ఆదేశాల మేరకు పట్టణంలో ఎస్సై చిరంజీవి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా కరన్ మరిభా ధోత్రె, సురేష్ అశోక్ పవార్‌లు పోలీసులను చూసి పారి పోవడానికి ప్రయత్నించారు. పోలీసులు వారిని వెంబడించి పట్టుకొని విచారించారు. ముగ్గురు కలిసి మెట్‌పల్లి పట్టణంలోని వెల్లుల్ల రోడులోని హన్‌మాన్ నగర్ కాలనీలోని 2023 అక్టోబరు నెలలో బాస రుద్రయ్య ఇంట్లో దొంగతనానికి పాల్పడి సుమారు 10తులాల బంగారం, ఒక సెల్ ఫోన్ ఎత్తుకెళ్ళారు. మండలంలోని వెల్లుల్ల గ్రామంలోని పోచంపల్లి లక్ష్మీ ఇంట్లో 2024 ఏప్రిల్ నెలలో చోరీకి పాల్పడి 5తులాల బంగారం, వెండి ఆభరణాలు, నగదును అపహరించినట్లు తెలిపారు. వారి నుంచి దొంగతనానికి ఉపయోగించే రెండు ఇనుప రాడ్లు, రూ. 5వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. దొంగతనాలు చేయడం అలవాటుగా చేసుకున్నారని వివరిచారు. ముఠాను పట్టుకోవడంలో పకడ్బందీగా వ్యవహరించిన మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సై చిరంజీవి, హెడ్ కానిస్టేబుల్ సదానందం, కానిస్టేబుల్స్ సంతోష్, కిరణ్‌లను డీఎస్పీ అభినందించారు.

చికిత్స పొందుతూ యువతి మృతి

ముస్తాబాద్, జూన్ 28: మండలంలోని గూడెం గ్రామానికి చెందిన ఓ యువతి చికత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం మూడు రోజుల క్రితం కరీంనగర్‌లో పురుగుల మందు తాగి భాగ్యలక్ష్మి అనే యువతి ఆత్మహత్య యత్నానికి యువతి పాల్పడగా ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో శుక్రవారం భాగ్యలక్ష్మి మృతి చెందింది. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విల పిస్తున్నారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

సంక్షోభంలో వ్యవసాయ రంగం

- రసాయనిక ఎరువులు తగ్గించాలి సాంకేతికతను పెంపొందించాలి
- పీజేటీఎస్ఏయూ పరిశోధన విభాగం డైరెక్టర్ రఘురాంరెడ్డి



మాట్లాడుతున్న పరిశోధన విభాగం డైరెక్టర్ రఘురాంండ్డి

వేములవాడ టౌన్, జూన్ 28: తెలంగాణ వ్యవసాయరంగం ఎంతో క్లిష్టమైన సవాళ్లను ఎదుర్కొంటుందని, చిన్న రైతులను ప్రభావితం చేస్తూ వాతావరణ సుస్థిరత, ప్రతిస్పందనను ప్రమాదంలో ఉంచుతు న్నాయని ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం సాంకేతిక విభాగం పరిశోధన విభాగం (పీజేటీఎస్ఏయూ) డైరెక్టర్ రఘురాంరెడ్డి రైతులకు సూచించారు. వేములవాడ పట్టణంలోని స్థానిక జర్మనీ సేవ్స్ స్వచ్ఛం ద సంస్థ భవనంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చెన్నమనేని రమేష్ బాబు ఆదేశాలతో రైతులకు వ్యవసాయంపై డేటా ఆధారిత సాంకేతికతల ద్వారా వర్క్‌షాప్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాణిజ్యపంటల వ్యవస్థల వైపు రైతులు ఆసక్తి చూపడం వలన ఇన్పుట్ ఖర్చులు పెరగడంతో రైతులు అప్పులపాలవుతున్నారని అన్నారు. ఆధునిక వ్యవసాయం ఆర్థిక ఒత్తిడి లను ఎదుర్కొలేకపోతున్నారని, వ్యవసాయ యాంత్రీకరణ వేగవంతం అవ్వడం, భూగర్భజలాలపై ఎక్కువ ఆధారపడటం అసమానతలను పెంచుతున్నాయని సూచించారు. దీంతో చిన్న, సన్నకారు రైతులను ప్రతికూల పరిస్థితులకు గురిచేస్తుందని తెలిపారు. వాతావరణ మార్పుల వలన అనిశ్చిత వర్షాలు, ప్రతికూల వాతవరణ పరిస్థితులను సృష్టిస్తూ సాంప్రదాయ వ్యవసాయ చక్రాలకు భంగం కలిగించి పంటల దిగుబడులను ప్రమాదంలో ఉంచుతున్నాయన్నారు. మట్టి క్షీణత, నీటి కొరత వంటి సమస్యలు విస్తృతంగా ఉన్నాయని, రసాయన ఎరువులను అతి వినియోగంగా, సమర్థవంతం కాని నీటిపారుదల పద్ధతులు భూగర్భజలాలను ప్రభావితం చేస్తున్నాయని సూచించారు. మౌలిక సవాళ్ల ఎదుర్కొనే సామర్థ్యాన్ని, ఉత్పాదకతను మెరుగుపరచడానికి, వాతావరణ ప్రతిఘటనను ప్రోత్సహించడానికి సమగ్ర పరిష్కారాలను అవలంబించాల్సి ఉందన్నారు. అక్రాట్ ప్రాజెక్ట్‌తో డేటా ఆధారిత సాంకేతికతలను, మానవ కేంద్రిత డిజైన్‌లను ఉపయోగిస్తే, సాంకేతిక ఆవిష్కరణలు, స్థిరమైన సహజ వనరుల నిర్వహణ మధ్య సమతుల్యతను ప్రోత్సహిస్తుందని అన్నారు. స్థిరమైన వ్యవసాయ పద్ధతులు జీవన వైవిధ్య సంరక్షణకు సాంకేతికతను తోడు చేసుకుని ముందుకు సాగాలని తెలిపారు. సులువైన వ్యవసాయ విధానంతో పంట ఉత్పత్తిని ఘననీయంగా పెంపొందించుకోవచ్చని ఆర్థిక అవకాశాలను చిన్న సన్నకారు రైతులు మెరుగుపర్చుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో జర్మనీ సాంకేతికత వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ రఘు, డాక్టర్ కల్పన శాస్త్రి, పొలాస విశ్వవిద్యాలయం అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్ తదితరులు ఉన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మల్యాల, జూన్ 28: దిగువ కొండగట్టులో గల బస్టాండ్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. జగిత్యాల నుంచి గురువారం కొండగట్టుకు ఆర్టీసీ బస్సులో వచ్చిన్నట్లు మృతుడి వద్ద లభించిన టికెట్‌ను బట్టి తెలుస్తోంది. మృతుడి వయస్సు 60ఏళ్ల లోపు ఉంటుందని ఆచూకి తెలిసిన వారు సంప్రదించాలని మల్యాల ఎస్సై-2 కుమారస్వామి తెలిపారు.

భార్య కేసు పెట్టిందని భర్త ఆత్మహత్య

సైదాపూర్, జూన్ 28: బొమ్మకల్ గ్రామానికి చెందిన నలువాల రాజు(40) అనే వ్యక్తి తన భార్య తనపై కేసు పెట్టిందని ఇంట్లో ఎవరు లేని సమయంలో చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నలువాల రాజు మద్యానికి బానిసై తన భార్య, కొడుకును తరుచు కొడుతూగొడవ చేసేవాడు. శుక్రవారం రాజు మద్యం సేవించి భార్య, కొడుకును కొట్టి ఇంటి నుంచి వెళ్లగొట్టాడు. దీంతో భార్య సుమలత గ్రామంలోని పెద్ద మనుషులకు కలిసి సైదాపూర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి భర్త రాజుపై ఫిర్యాదు చేసింది. తనపై భార్య పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టిందని తెలుసుకున్న రాజు మద్యం మైకంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సుమలత ఇంటికి తిరిగి వచ్చి చూడగా రాజు ఉరి వేసుకొని కనిపించాడు. ఎస్సై జన్ను ఆరోగ్యం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు కొండగట్టుకు పవన్‌కల్యాణ్

● ఏడాది క్రితం ఎన్నికల రథం వారాహికి పవన్ పూజలు ● ఏపీలో ఘనవిజయంతో దర్శనానికి వస్తున్న ఏపీ డిప్యూటీ సీఎం



కొండపైన ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ, సీఎస్‌వో

మల్యాల, జూన్ 28: ఏపీ డిప్యూటీ సీఎం, జనసేనాని కొనిదెల పవన్‌కళ్యాణ్ శనివారం కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనానికి వస్తున్నారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికల ఫలితాల్లో ఘనవిజయం సాధించడంతో ఆ విజయం వెనుక కొండగట్టు ఆంజనేయస్వామి అండ, ఆశీస్సులేనని మొక్కులు చెల్లించుకోవడానికి పవన్ కొండగట్టుకు వస్తున్నట్లు ఆయన అభిమానులు పేర్కొంటున్నారు. గత ఏడాది జనవరి 24న పవన్ కొండగట్టులో పర్యటించి ఏపీలో ఎన్నికల ప్రచారానికి వినియోగించే నూతన వాహనం వారాహికి పూజలు జరిపించారు. అనంతరం ఏపీలో ఆ వాహనంతో ఎన్నికల ప్రచారం చేయడం, అక్కడ పోటీ చేసిన 21 స్థానాల్లో గెలుపొందడం, ఏపీ డిప్యూటీ సీఎంగా పదవిని అలంకరించడం కొండగట్టు ఆంజనేయస్వామి ఆశీస్సులేనని అందులో భాగంగానే కొండగట్టుకు వస్తున్నట్లు తెలుస్తోంది. పవన్ 15ఏళ్ల క్రితం కూడా ప్రజారాజ్యం పార్టీ ప్రచారంలో భాగంగా కొండగట్టుకు వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. జనసేన పార్టీ ఏర్పాటుకు ముందు 2018లో రెండవ సారి రాగ జనసేన పార్టీ ఏర్పాటు చేశాక గతేడాది వచ్చిన పవన్ ఆంజనేయస్వామిని దర్శించుకొని అంజన్న అండతోనే తన రాజకీయ ప్రస్థానం మొదలుపెడుతున్న అని పేర్కొంటూ కొండగట్టులోనే ఎన్నికల ప్రచార వాహనంతో శమరశంఖాన్ని పూరించారు. గతంలో పార్టీ అధినేతగా రాగ ఈ సారి డిప్యూటీ సీఎం హోదాలో అధికారికంగా పర్యటిస్తున్నారు. ఇందుకు గాను దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేస్తుండగా 240 మంది పోలీసులచే భారీ బందోబస్తు చర్యలు చేపట్టారు. ఇదిలా ఉంటే శనివారం పవన్‌కళ్యాణ్ పర్యటన ఏర్పాట్లను ఆయన చీఫ్ సెక్యూరిటి అధికారి అర్జున్, జగిత్యాల ఎస్పీ అశోక్‌కుమార్, డీఎస్పీ రఘుచందర్, సీఐ నీలం రవి పరిశీలించారు.

చోరీ కేసులో ముగ్గురు నిందితుల అరెస్ట్



మాట్లాడుతున్న మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం,జూన్ 28: మండలంలోని రాజేశ్వర్‌రావుపేట గ్రామ శివారులో జాతీయ రహదారిపై చోరీకి పాల్పడిన ముగ్గురు నిందితులను ఇబ్రహీంపట్నం పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు.ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం ఎస్ఐ పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 23న రాజేశ్వర్‌రావుపేట గ్రామ శివారులో జాతీయ రహదారిపై అగి ఉన్న లారీ వద్దకు ముగ్గురు వ్యక్తులు వెళ్లి డ్రైవర్‌ను కొట్టి అతడి వద్ద నుంచి డబ్బులు, సెల్‌ఫోన్ దొంగిలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలి పారు. శుక్రవారం మెట్‌పల్లి సీఐ, ఇబ్రహీంపట్నం ఎస్ఐ అనిల్ గండి హన్‌మాన్ ఆలయం వద్ద వాహనాలు తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానస్పదంగా బైక్‌పై వస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనానికి పాల్పడినట్లు ఒప్పుకోవడంతో అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నిందితులైన ఏనుగు వంశీ(మేడిపల్లి), శివరాత్రి గణేస్(భీంగల్), మామడి శివ(మేడిపల్లి) అనే వ్యక్తు ల వద్ద నుంచి 3 సెల్‌ఫోన్‌లు, ఒక బైక్, 8 వేల నగదును స్వాధీనం చేసుకోని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

ఎన్‌టీపీఏ రాష్ట్ర అధ్యక్షుడిగా వెంకటేశ్వర్‌రావు



వెంకటేశ్వర్‌రావు

తిమ్మాపూర్, జూన్ 28: ఎన్‌టీపీఏ రాష్ట్ర అధ్యక్షుడిగా వెంకటేశ్వర్‌రావు ఎన్నికయ్యారు. హైదారాబాద్‌లో శుక్రవారం తెలంగాణ నాన్ టెక్నికల్ పర్సనల్ అసిస్టెంట్(ఎన్‌టీపీఏ గెజిటెడ్) రాష్ట్ర సంఘం ఎన్నికలు నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఎల్‌ఎండీ కాలనీలో గల ఇరిగేషన్ సర్కిల్-2లో ఎన్‌టీపీఏగా విధుల నిర్వహిస్తున్న కొలుగూరి వెంకటేశ్వర్‌రావు ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా తెక్కల రామచంద్రారెడ్డి, సహ అధ్యక్షుడిగా మామిడి రమేశ్, కోశాధికారిగా శెట్టి సురేష్, ఉపాధ్యక్షులుగా వెంకటరమణ, శైలజారాణి, చంద్రశేఖర్ ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శులుగా హన్మంతు, లక్ష్మణ్, అనితరాణి, కార్యనిర్వహణ కార్యదర్శిగా బుట్టి సత్యనారాయణ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా రాజమల్లయ్య, గురువయ్య, సైపుల్లా, వినయ్‌కుమార్, సలహాదారులుగా విశ్వంభరాచారి ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా యస్ విశ్వంబరాచారి, ఎన్‌టీపీఏ(రిటైర్డ్) వ్యవహరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



రజాక్(ఫైల్)

బోయినపల్లి, జూన్ 28: బోయినపల్లి మండలం కొదురుపాక గ్రామంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన సంఘ టనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. కొదురు పాక గ్రామానికి చెందిన మహమ్మద్ రజాక్ (64) ఇల్లంతకుంటలో నివాసం ఉంటున్నాడు. ద్విచక్రవాహనంపై శుక్రవారం స్వగ్రామానికి వచ్చారు. గ్రామంలో వాహనం అదుపు తప్పి కింద పడి మృతి చెందాడు. ఎస్ఐ పృథ్వీధర్ గౌడ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బెల్ట్ షాపు యజమానిపై కేసు నమోదు

ఇల్లందకుంట, జూన్ 28: మండలంలోని లక్ష్మాజీపల్లె గ్రామానికి చెందిన ఓ బెల్ట్ షాపు నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజకుమార్ తెలిపారు. ఎలాంటి అనుమతి లేకుండా అక్రమ మద్యం దాదాపు రూ. 19,200 విలువ గల మద్యాన్ని నిల్వ చేసినట్లు అందిన సమాచారం మేరకు తనిఖీ చేసి సరుకు స్వాధీనం చేసుకొని సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజకుమార్ తెలిపారు.

చుట్టుపక్కల ఇళ్ల తలుపులకు గడియ పెట్టి చోరీకి యత్నం

- స్థానికులు రావడంతో దుండగులు పరార్
- ఒకరిని పట్టుకుని పోలీసులకు అప్పగింత

హుజూరాబాద్, జూన్ 28: హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని సైదాపూర్ రోడ్‌లోని అహల్యనగర్‌లో శుక్రవారం తెల్లవారుజామున చుట్టుపక్కల ఇళ్ల తలుపులకు గడియ పెట్టి చోరీకి యత్నం చేశారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని అహల్యనగర్‌లో నివాసం ఉంటున్న సతీష్ అనే వ్యక్తి ఇంటికి ఐదుగురు గుర్తు తెలియని దుండగులు వచ్చారు. మొదట కరెంటును నిలిపివేసి, చుట్టూ పక్కల ఇళ్లల్లో నివాసం ఉంటున్న వారు బయటకు రాకుండా తలుపులకు బయటి నుంచి గడియ పెట్టి ఉంచారు. సతీష్ ఇంట్లో అద్దెకు ఉండే రమేశ్ ఇంటి తలుపులను బాది చోరీకి యత్నం చేశారు. అతను చుట్టూ పక్కల వారికి ఫోన్ చేశాడు. వారు బయటకు రావడానికి ప్రయత్నించగా తలుపులు తెరుచుకోలేదు. దీంతో వారు మరికొంత మందికి ఫోన్లు చేయడంతో పాటు 100కు డయల్ చేశారు. ఈ క్రమంలో అందరు ఒకేసారి రావడంతో గమనించిన దుండగులు పారిపోయేందుకు ప్రయత్నించారు. వారిలో ఒకరిని స్థానికులు పట్టుకున్నారు. వారి వద్ద ఇనుప రాడ్లు, కట్టర్లు, కత్తులు దొరికాయి ఈ క్రమంలోనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దొంగను అదుపులోకి తీసుకున్నారు. వీరందరూ హరియాణా, బిహార్, ఒరిస్సా భాష మాట్లాడు తున్నారని స్థానికులు తెలిపారు. నెల రోజుల క్రితం అదే కాలనీలోని మహిళా కండక్టర్ ఇంట్లో రూ. 50వేల నగదుతో పాటు బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. అయినప్పటికీ పోలీసులు రాత్రి వేళల్లో గస్తీ పెంచకపోవడంతో దొంగలకు అనుకూలంగా మారింది. కాగా నాలుగు సార్లు ఫోన్ చేసినా పోలీసులు ఆలస్యంగా రావడంపై స్థానికులు విమర్శలు చేస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు

జగిత్యాల టౌన్, జూన్ 28: యువతిని హత్య చేసిన కేసులో ఒకరికి జీవిత ఖైదుతో పాటు రూ. 5వేల జరిమాన విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ శుక్రవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం మెట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆత్మకూర్ గ్రామానికి చెందిన గుండబోయిన నర్సు అనే మహిళ వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తోంది. తనకు రాణి (15) అనే ఒక కూతురు ఉంది. చదువు మానివేసి ఇంటి వద్దే ఉంటోంది. అదే గ్రామానికి చెందిన పాలెపు తిరుమల్ నర్సు కూతురుతో సన్నిహితంగా ఉంటున్నాడు. తిరుమల్ 2016 డిసెంబర్ 7న రాణిని నమ్మించి గ్రామ శివారులో ఉన్న చేద బావి వద్దకు తీసుకెళ్లి మెడకు క్లచ్ వైరు బిగించి హత్యకు పాల్పడి అనుమానం రాకుండా మృతదేహాన్ని చేద బావిలో పడేసి పరారయ్యాడు. ఇంటి నుంచి బయటకు వెళ్లిన తన కూతురు తిరిగి రాకపోవడంతో నర్సు పోలీసులను ఆశ్రయించింది. రెండు రోజుల అనంతరం పోలీసుల విచారణలో రాణిని తిరుమల్ హత్య చేసి చేద బావిలో పడేసినట్లు గుర్తించారు. నర్సు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ అశోక్ కేసు నమోదు చేసి నిందితుడైన తిరుమల్‌ను కోర్టులో ప్రవేశ పెట్టారు. కోర్టు పోలీసులు సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ మల్లిఖార్జున్ కేసు వాధించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయి అయిన తిరుమల్‌కు జీవిత ఖైదు శిక్ష విధిస్తూ ప్రధాన న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ముద్దాయికి శిక్ష పడడంలో కృషి చేసిన పోలీసుల అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

కలెక్షన్ చేసిన డబ్బులతో డ్రైవర్ పరార్

- పోలీసులకు ఫిర్యాదు చేసి డిస్ట్రిబ్యూటర్

జగిత్యాల టౌన్, జూన్ 28 :కలెక్షన్ చేసిన డబ్బులతో డ్రైవర్ ఉడాయించడంతో ఓ డిస్ట్రిబ్యూటర్ ఫిర్యాదు మేరకు జగిత్యాల పోలీసులు కేసు నమోదు చేశారు. హైదరాబాద్‌కు చెందిన చైల్ సింగ్ అనే వ్యక్తి తెలంగాణ ప్రాంతానికి ఫైబ్రోస్ ఎలక్ట్రికల్ కంపెనీకి డిస్ట్రిబ్యూటర్‌గా ఉన్నాడు. తన కంపెనీ లావాదేవీలకు సంబంధించిన విషయంలో చైల్ సింగ్ స్వయంగా వెళ్లి కలెక్షన్ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రాజస్థాన్ ప్రాంతానికి చెందిన దయరాం సింగ్ అనే వ్యక్తిని ఏడాది క్రితం తన కారు డ్రైవర్‌గా చైల్ సింగ్ నియమించుకుని వ్యాపారం చేస్తున్నాడు. రెండు రోజుల క్రితం చైల్ సింగ్ నిజామాబాద్, ఆదిలాబాద్ తదితర పట్టణాల్లో తన కంపెనీకి సంబంధించిన కలెక్షన్ చేసుకుని గురువారం జగిత్యాలకు చేరుకున్నారు. కారును యావర్ రోడ్డు పార్క్ వద్ద పార్కింగ్ చేసి చైల్ సింగ్ కలెక్షన్ కోసం వెళ్లి తిరిగి వచ్చేసరికి కారులో ఉన్న డ్రైవర్ దయరాం సింగ్ కనబడలేదు. కలెక్షన్ చేసిన రూ. 18 లక్షల నగదుతో తన డ్రైవర్ దయారాం సింగ్ తనను మోసం చేసి ఊడాయించాడని పోలీసులకు ఫిర్యాదు చేయగా జగిత్యాల టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తోడేళ్ల దాడిలో గేదె, లేగ దూడ మృతి



మృతిచెందిన గేదె

కోనరావుపేట జూన్ 28: కోనరావుపేట మండలం ధర్మారం గ్రామ శివారులో సత్యనారాయణ పల్లె ప్రాంతంలో శుక్రవారం తెల్లవారుజామున తోడేళ్లు దాడి చేయగా గేదె, లేగ దూడ మృతి చెందినట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. ధర్మా రం గ్రామానికి చెందిన కమిటిరెడ్డి అచ్చిరెడ్డికి చెందిన గేదే, లేగ దూడ రెండింటితోపాటు ఎద్దులను తమ పొలం వద్ద పశువుల పాకలో కట్టేసి ఇంటికి వచ్చాడు. శుక్రవారం తెల్లవారుజామున వెళ్లి చూసేసరికి మృతి చెందినట్లు గుర్తించి అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీ శాఖ అధికారులు బాపు రాజు చేరుకొని అడుగులను గుర్తించి తోడేళ్ల దాడిలో రెండు పశువులు మృతి చెందినట్లు గుర్తించారు. దీంతో రూ. 50 వేల వరకు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపారు బాధిత రైతుకు వెంటనే నష్టపరిహారం అందిస్తామని ఎఫ్‌ఎస్‌వో బాపురాజు తెలిపారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ అడవి ప్రాంత రైతులు జాగ్రత్తగా ఉండాలని సూ చించారు. అటవీ ప్రాంతంలో చిరుతలు తోడేళ్లు తిరుగు తున్నా యని రైతులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. రాత్రిపూట తమ పశువులను ఇంటి వద్దనే ఉంచుకోవాలని తెలిపారు.

పరిహారం కోసం రైతుల నిరసన



రైల్వే పనులను అడ్డుకుంటున్న రైతులు

తంగళ్లపల్లి, జూన్ 28: పరిహారం చెల్లించడం లేదని రైల్వే లైను పనులు జరుగుతున్న ప్రదేశం వద్ద బాధిత రైతులు నిరసన వ్యక్తం చేశారు. బాధిత రైతుల కథనం ప్రకారం.. తంగళ్లపల్లి మండలం నర్సింహులపల్లె గ్రామ శివారులోని 168, 169 సర్వే నంబర్లలో గ్యాదవేని రాములు, పెద్ద నర్సయ్య, చంద్రయ్య, ప్రసాద్, ప్రశాంత్, బాలయ్య, కనకయ్య, చిన్న నర్స య్య, మధులకు చెందిన మొత్తం 10 ఎకారాల భూమి ఉంది. రైల్వే లైను కోసం నాలుగు ఎకారాల భూమిని రెవెన్యూ అధికారులు సేకరించి ఎకారకు ఏడు లక్షల రూపాయల చొప్పున రైతులకు పరిహారం చెల్లించారు. కాని 168 సర్వే నంబరులో ఉన్న రెండు బావులు, ఒక బోరు బావికి సంబంధించి పరిహారం ఇవ్వడం లేదని రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఆరు నెలలుగా రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్న పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికే నాలుగుసార్లు సర్వే చేసి కొలతలు తీసుకున్నారని పరిహారం మాత్రం చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైల్వే అధికారులను ప్రశ్నిస్తే పోలీసుస్టేషన్‌లో వేయిస్తామని బెదిరింపులకు గురిచేస్తున్నారని అన్నారు. ఉన్నాతాధికారులు జోక్యం చేసుకొని బావులు, బోరు బావి పరిహారం ఇప్పించాలని బాధిత రైతులు డిమాండ్ చేస్తున్నారు.

సత్ఫలితాలనిస్తున్న త్రీడీ యానిమేటెడ్ చిత్రాలు



రహదారిపై త్రీడీ యానిమేటెడ్ చిత్రం

సిరిసిల్ల క్రైం, జూన్ 28: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ కోసం రహదారులపై ఏర్పాటు చేసిన త్రీడీ యానిమేటెడ్ చిత్రాల వినూత్న ప్రయోగం ఫలిస్తోంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని కొదురుపాక, సిరిసిల్ల పట్టణం రగుడు చౌరస్తాల వద్ద త్రీడీ యానిమేటెడ్ పెట్రోకార్, బ్లూ కోల్ట్స్ పోలీసు అధికారి చిత్రాలను గత డిసెంబరులో ఏర్పాటు చేశారు. వినూత్న ప్రయోగానికి ఎస్పీ అఖిల్ మహాజన్ శ్రీకారం చుట్టారు. దీంతో రహదారిపై వెలుతున్న వాహనదారులు ఆ చిత్రాలను చూసి వెంటనే అలర్ట్ అవుతున్నారు. రహదారిపై నిజమైన పోలీసు వాహనం, పక్కన కానిస్టేబుల్ ఉన్నట్లుగా వాహనదారులకు కనిపించడంతో వాహనాల వేగానికి కళ్లెం పడుతోంది. ఇటీవల ఓ ద్విచక్రవాహనదారుడు రహదారిపై వెలుతూ త్రీడీ యానిమేటెడ్ చిత్రాలుచూసి వెంటనే హెల్మెట్ ధరించిన దృశ్యాలు వైరల్‌గా మారింది. అంతకుముందు ఈ ప్రాంతాల్లో 36 ప్రమాదాలు చోటుచేసుకోగా, గత ఆరునెలల కాలంలోఏ ఒక్క ప్రమాదం జరగకపోవడంతో త్రీడీ యానిమేటెడ్ చిత్రాల ప్రయోగం ఫలించినట్లయింది.

జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి

సిరిసిల్ల టౌన్, జూన్ 28 : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణం బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని ఆరోపించారు. వెంటనే ప్రభుత్వం రెండు లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏడు నెలలు కావస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం దురదృష్టకరమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంత్రి వర్గ విస్తరణ, నామినేటెడ్ పోస్టులు భర్తీ కోసం ఢిల్లీలోని అధిష్ఠానంతో చర్చలు జరపడానికి పెట్టిన దృష్టి తెలంగాణ ప్రజలు, నిరుద్యోగ యువతపైన పెట్టాలని డిమాండ్ చేశారు. మేనిఫెస్టోలో పెట్టిన హామీలను అమలు చేయకపోతే బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో ఆందోళనలను చేపడతామన్నారు. సమావేశంలో నాయకులు మట్టె శ్రీనివాస్, కోడం వెంకటేష్, రుద్రవేని రాకేష్, నడిమెట్ల సందీప్, ఒగ్గు అరవింద్, మిరియాల సంపత్, కార్తిక్, నిఖిల్, సాయి, నరేష్, తిరుపతి పాల్గొన్నారు.

లిఫ్ట్ ఇరిగేషన్ పనులు త్వరగా పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కొండూరు గాంధీ

వీర్నపల్లి, జూన్ 28: రాయిని చెరువు లిఫ్ట్ ఇరిగేషన్ పనులను త్వరగా పూర్తి చేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొండూరి గాంధీ అన్నారు. వీర్నపల్లి మండలం మద్దిమల్ల గ్రామంలో రాయిని చెరువు పునరుద్ధరణ పనులను గ్రామస్థులతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుమారు 450 సంవత్సరాల క్రితం గాంధీ బాపు వారసత్వానికి చెందిన రాయుడు పేరు పైన ఈ చెరువు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. గత ప్రభుత్వాలతో ప్రత్యేక నిధులు మంజూరు చేయించుకుని రాయని చెరువును మరమ్మతులు చేశారన్నారు. రాయిని చెరువు ద్వారా సుమారు రెండు వేల ఎకరాల పంట సాగు చేస్తున్నారన్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పూర్తిచేసి రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు జోగుల సుదర్శన్, జవహర్లాల్ నాయక్, నాయకులు సంతోష్, లచ్చయ్య, రవి, మహేష్, నాగరాజు, సతీష్, దేవ్ సింగ్, తిరుపతి పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులను గౌరవించుకోవాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి



కార్మికురాలికి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

సిరిసిల్ల టౌన్, జూన్ 28: మున్సిపల్ పారిశుధ్య కార్మికులు విలువైన సేవలను అందిస్తున్నారని వారిని గౌరవించుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణం సీనారె కళా మందిరంలో కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో సిరిసిల్ల మున్సిపల్ పారిశుధ్య కార్మికుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని చైర్‌పర్సన్ కళాచక్రపాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడతూ కార్మికుల ఆరోగ్య పరిరక్షణ కోసం ఉచిత వెద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన మెడికవర్ ఆసుపత్రి యాజమాన్యం, వైద్యులకు అభినందనలు తెలిపారు. అనంతరం ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు, ప్రతినిధులను చైర్‌పర్సన్ సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ భూక్య రెడ్డినాయక్, మున్సిపల్ ఎన్విరాన్మెంట్ ఇంజనీరు రఘు, మెడికవర్ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూములను అనుచరులకు ఇప్పించిన కేటీఆర్

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జల్గం ప్రవీణ్

తంగళ్లపల్లి, జూన్ 28: అసైన్డ్ భూములను తన అనుచరులకు అప్పగించిన ఘనత మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్‌ది అని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జల్గం ప్రవీణ్ ఆరోపించారు. శుక్రవారం తంగళ్లపల్లి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసైన్డ్ ల్యాండ్ కమిటీలో ఆర్డీవో సంబంధిత అధికారులు ఉన్నప్పటికీ తాను చెప్పిందే వేదంగా కేటీఆర్ పాలన సాగిందని విమర్శించారు.

కేటీఆర్ పీఏ ఆదర్శ వివాహం చేసుకుంటే ఐదెకరాల భూమి కేటాయించారని చెప్తుండగా.. దీనికి సంబంధించి ఆర్టీఏ యాక్ట్ ప్రకారం దరఖాస్తు చేస్తే ఆదర్శ వివాహం చేసుకున్న వారికి ఐదెకారాల భూమి కేటాయించలేదని ఆర్డీవో వివరణ ఇచ్చారని అన్నారు. నిబంధనలు పాటించకుండా ఐదు మండలాల్లో వందల ఎకారాల అసైన్డ్ ల్యాండ్ తన అనుచరులకు, తనకు సంబంధించిన పత్రికలో పని చేసే కొంత మందికి రెండెకరాల భూమిని కేటాయించారని ఆరోపించారు. అర్హులైన వారందరికీ భూమి కేటాయించాలని డిమాండ్ చేశారు. మీరు తప్పులు చేసి కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు లింగాల భూపతి, ఎంపీటీసీ భైరినేని రాము, నేరెళ్ల నర్సింగంగౌడ్, మల్లేశం యాదవ్, గడ్డం మధుకర్, చుక్క శేఖర్, ఎగుర్ల ప్రశాంత్, తిరుపతి యాదవ్, సత్తు శ్రీనివాస్‌రెడ్డి, ఆరేపల్లి బాలు, మిరాల శ్రీనివాస్, చందు, చిలుక శ్రీనివాస్, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

పీవీ నర్సింహారావు సేవలు మరవలేనివి

బహుభాషా కోవిదుడు, మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు జయంతి వేడుకలు జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. దేశానికి పీవీ నర్సింహారావు అందించిన సేవలను కొనియాడారు.



ఎల్లారెడ్డిపేటలో నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిరిసిల్ల టౌన్, జూన్ 28: బహుభాషా కోవిదుడు మాజీ ప్రధాన మంత్రి పీవీ నర్సింహారావును దేశ ప్రజలు మరవలేదని టీపీసీసీ సభ్యుడు నాగుల సత్యనారాయణ అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణం గాంధీచౌక్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ప్రధాన మంత్రి పీవీ నర్సింహారావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. టీపీసీసీ సభ్యులు నాగుల సత్యనారాయణ, సంగీతం శ్రీనివాస్ కేక్ కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దక్షిణ భారతదేశం నుంచి మొట్టమొదటి ప్రధానమంత్రిగా ఎన్నికైన పీవీ నర్సింహారావు బహుభాషా కోవిదుడుగా మన్ననలను అందుకున్నాడని అన్నారు. పీవీ ఆశయాలకు అనుగుణంగా కాంగ్రెస్ శ్రేణులు ముందుకు వెల్లాలన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, కౌన్సిలర్లు కుడికాల రవికుమార్, వేముల రవి, మహిళ జిల్లా ప్రధానకార్యదర్శి కల్లూరి చందన, చేనేత సెల్ పట్టణ అధ్యక్షుడు గుడిశెట్టి బాలరాజు, సిరిసిల్ల పద్మశాలి సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ, మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షుడు బొప్ప దేవన్న పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మాజీ ప్రధాని స్వర్గీయ పీవీ నరసింహారావు ఆదర్శ ప్రాయుడని కాంగ్రెస్ పార్టీ మానకొండూర్ నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి పేర్కొన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం పీవీ జయంతిని ఘనంగా నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు యాస తిరుపతి, మల్లారెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, రజనీకాంత్, చంద్రమౌళి, మల్లయ్య, శ్రీనివాస్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు స్థానిక పాత బస్టాండు ప్రాంతంలోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పీవీ నర్సింహరావు దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, గౌస్, తిరుపతి, గిరిధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బాల్‌రెడ్డి, కిషన్, బాలరాజుయాదవ్, రాములు, బుచ్చాగౌడ్, దేవయ్య, రాంరెడ్డి, రి, రఫీక్, రాజునాయక్, బాబు, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

వేములవాడ టౌన్: కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య ఆధ్వర్యంలో వేములవాడ మున్సిపల్ పరిధిలోని నందికమాన్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ నాయకులు భారతరత్న పీవీ నర్సింహారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వనపట్ల ప్రభాకర్‌రెడ్డి, ఎర్రం ఆగయ్య, కత్తి కనుకయ్య, వనపర్తి దేవరాజు, గాలిపెల్లి స్వామి, ఊరడి రాంరెడ్డి, సిలివేని మల్లేశం తదితరులు ఉన్నారు.

గంభీరావుపేట: మండల కేంద్రంలో పీవీ నర్సింహారావు జయంతి సంధర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంచి పెట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పాపగారి రాజు, నాయకులు ఎడబోయిన ప్రభాకర్, బంగ్ల రాజు, విఠల్, వెంకటి, నాంపెల్లి, గంగి సురేష్, నర్సింలు, లచ్చయ్య, జంగం రాజులు, శంకర్ తదితరులు ఉన్నారు.

చందుర్తి: మండల కేంద్రంలో పీవీ నర్సింహారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో వేములవాడ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్, డీసీసీ ప్రధాన కార్యదర్శి గొట్టె ప్రభాకర్, నాయకులు పులి సత్యం, బొజ్జ మల్లేశం, బాణాల రవీందర్, దారం చంద్రం, మల్యాల శేఖర్, గుంటుక అనిల్, వట్టిమల్ల రవి, బాల్‌రెడ్డి, ఆదిత్య, మల్లయ్య తదితులు పాల్గొన్నారు.

కోనరావుపేట: కోనరావుపేట మండల కేంద్రంలో శుక్రవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా పీవీ నర్సింహారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రంలో కాంగ్రెస్ నాయకులు కేతిరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, కచ్చకాయల ఎల్లయ్య, మానుక సత్యం కేతిరెడ్డి లక్ష్మారెడ్డి, నందుగౌడు. బాల్‌రెడ్డి ఉప్పుల గంగయ్య, బాదనేని బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండల కేంద్రంలో పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి దేశానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జల్గం ప్రవీణ్, నాయకులు నేరెళ్ల నర్సింగంగౌడ్, భైరినేని రాము, లింగాల భూపతి, సత్తు శ్రీనివాస్‌రెడ్డి, మోర లక్ష్మీరాజం, సుద్దాల శ్రీనివాస్, మందాటి తిరుపతి పాల్గొన్నారు.

ముస్తాబాద్: ముస్తాబాద్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పీవీ నర్సింహారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గుంగం నర్సయ్య, పట్టణ అధ్యక్షుడు గజ్జెల రాజు, ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్, తాళ్ల విజయ్‌రెడ్డి, శీల ప్రశాంత్, తలారి నర్సింలు, కొండల్‌రెడ్డి,రంజాని నరేశ్, మదాసు అనిల్, దీకొండ దశరత్, కదిరె సత్యనారాయణ, నవీన్‌గౌడ్, కొప్పు రమేశ్, ఉచ్చిడి బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇల్లంతకుంట పండ్లను పంపిణీ చేస్తున్న నాయకులు

బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో..



సిరిసిల్ల బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో
పీవీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్: సిరిసిల్ల పట్టణం బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధాన మంత్రి పీవీ నర్సింహారావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పీవి నర్సింహారావు చిత్రపటానికి జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణారాఘవరెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, ప్రజాప్రతినిధులు, నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, తంగళ్లపల్లి ఎంపీపీ పడిగెల మానసరాజు, బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, నాయకులు కుంబాల మల్లారెడ్డి, పడిగెల రాజు, కంచర్ల రవిగౌడ్, సికిందర్, రామాగౌడ్ పాల్గొన్నారు.



వేములవాడలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



ముస్తాబాద్‌లో..



చందుర్తిలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సహకార రంగానికి వన్నె తెచ్చాం..

- **సంపూర్ణ సహకారమందిస్తా.. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా**
- **కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ముందుకెళ్లండి**
- **మంత్రి పొన్నం ప్రభాకర్**

కరీంనగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): 'మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో మార్క్‌ఫెడ్ చైర్మన్‌గా నాకు, కేడీసీసీబీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావుకు ఫ్రీ హ్యాండ్ ఇచ్చారు.. మార్క్‌ఫెడ్‌కు అడగ్గానే వెయ్యి కోట్లను ప్రభుత్వం అప్పుగా తీసుకొని ఇచ్చింది. ఇఫ్కోకు ఫర్టిలైజర్స్ కోసం ఒకేసారి 250 కోట్ల రూపాయల చెక్కు ఇచ్చి ఎరువులు తీసుకువచ్చాం. వరి, మొక్కజొన్న కొనుగోళ్లకు, సహకార సంఘాల చైర్మన్లకు ప్రొటోకాల్ కల్పించే విధంగా జీవో తీసుకువచ్చి సహకార రంగానికే వన్నె తెచ్చాం' అని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం కేడీసీసీబీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు అధ్యక్షతన కరీంనగర్‌లో జరిగిన మహాజన సభ సమావేశానికి మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కేడీసీసీబీ, డీసీఎంఎస్, చేనేత సహకార సంఘాల ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తనకు రాజకీయ జన్మనిచ్చింది సహకార రంగమేనని, ఏ పదవిలో ఉన్నా సింగిల్ విండో చైర్మన్‌గా మీతోనే ఉంటానన్నారు. అన్ని పార్టీలు సామరస్యంతో కలిసి పనిచేసి సహకార రంగానికి ఊపిరి పోద్దామని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో సమన్వయంగా కార్యక్రమాలను రూపొందించుకొని సహకార సంఘాలను మరింత ముందుకు తీసుకెళ్లాలని చైర్మన్లు, పాలకవర్గాలకు సూచించారు. సిరిసిల్ల, ఇతర ప్రాంతాల చేనేత కార్మికులకు అండగా ఉంటామని మంత్రి ప్రభాకర్ ప్రకటించారు.

● సహకార సంఘాల బలోపేతానికి కృషి : కేడీసీసీబీ చైర్మన్ కొండూరి

2005 నుంచి కేడీసీసీబీ చైర్మన్‌గా తాను, డీసీఎంఎస్ చైర్మన్‌గా పొన్నం ప్రభాకర్ ఆనాటి నుంచి ఇప్పటి వరకు సహకార సంఘాల బలోపేతానికి కృషిచేశామని కేడీసీసీబీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఏ పదవిలో ఉన్నా సహకార సంఘాలపై ఆప్యాయత చూపిస్తూ, కరీంనగర్‌లో సహకార రంగాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు సహకరించారని అన్నారు. క్రిబ్‌కో డైరెక్టర్‌గా 19 ఏళ్ల నుంచి పొన్నం ప్రభాకర్ సహకార రంగానికి సహకరిస్తున్నారని చెప్పారు. క్రిబ్ కో సంస్థలో కేడీసీసీబీ నుంచి ఐదు కోట్లు పెట్టాలని పొన్నం ప్రభాకర్ సూచించడంతో అన్ని సంఘాల నుంచి ఆ మొత్తాన్ని సేకరించి ఐదు కోట్లు డిపాజిట్ చేశామని, దీంతో ప్రతి ఏడాది కోటి రూపాయల చొప్పున బ్యాంకుకు డబ్బు వస్తుందని అన్నారు. పెట్రోల్ బంక్, ఇతరత్రా సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. సమావేశంలో కేడీసీసీబీ వైస్ చైర్మన్ పి రమేశ్, మాజీ ఎమ్మెల్యే వుచ్చిడి మోహన్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, సీఈవో సత్యనారాయణరావు, కేడీసీసీబీ డైరెక్టర్లు, సింగిల్ విండో చైర్మన్లు, చేనేత సహకార సంఘాల ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ఆధునిక పద్ధతులపై రైతులకు అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రఘు

కోనరావుపేట, జూన్ 28: వ్యవసాయంలో రైతులు అధిక దిగుబడులు సాధించేదుకు ఆధునిక పద్ధతులపై ఇండోజర్మన్ ప్రొఫెసర్, జయశంకర్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో మండలంలోని నాగారాం గ్రామ రైతులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జర్మనీ యూనివర్సిటీ పరిశోదన డాక్టర్ రఘు మాట్లాడుతూ మారుతున్న వాతావరణం దృష్ట్యా పెట్టుబడులు తగ్గిస్తూ అధిక దిగుబడులు సాధించేందుకు తీసుకోవాల్సి జాగ్రత్తలు పలు సూచనలు ఇచ్చారు. నాగారాం గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా రెండు సంవత్సరాలుగా కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ పరిశోదన ప్రతినిధులు మహేష్, కృష్ణ, ముఖేష్, రైతులు పాల్గొన్నారు.

నారుమడిని ధ్వంసం చేసిన అడివిపందులు

ఇల్లంతకుంట, జూన్ 28: మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామంలో కోలపురం మల్లయ్యకు చెందిన నారుమడిని అడివి పందులు శుక్రవారం ధ్వంసం చేశాయి. వ్యవసాయ బావివద్ద నారుపోయగా అడివిపందుల మంద వచ్చి నారుమడిని పాడుచేయగా నష్టం జరిగిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం

చందుర్తి జూన్ 28 మండలంలోని మూడపల్లిలోగల వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం పద్మావతీ, గోదాదేవి సహిత వేంకటేశ్వరస్వామి వారి కల్యాణం ఘనంగా జరిగింది. స్వామివారి కల్యాణోత్సవాన్ని ఆలయ పూజారి వంశీ వేద మంత్రోచ్ఛరణల మధ్య అంగరంగ వైభవంగా ఆలయ శాశ్వత చైర్మన్, విశాఖ ఇండస్ట్రీస్ సీఈవో జేపీ రావు దంపతులు, గ్రామస్థుల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిలుక ఆంజిబాబు, బాణాల రవిందర్ రెడ్డి, మల్లారెడ్డి, పుల్కం రవి, బాబు, రవి, తదితరులు పాల్గోన్నారు.

తారు రోడ్డుపై గుంత: వాహనదారుల ఇబ్బందులు

వేములవాడ టౌన్, జూన్ 28: వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి గ్రామ ప్రధాన చౌరస్తా వద్ద తారు రోడ్డుపప గుంత పడి ప్రమాదకరంగా మారింది. వేములవాడ శ్రీరాజ రాజేశ్వరస్వామి వారి ఆలయానికి నిత్యం వేల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. రోడ్డుపై ఎద్ద గుంత ఏర్పడటంతో ద్విచక్రవాహనదారులు గమనించక ప్రమాదాల బారిన పడుతూ గాయాలపాలవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. వర్షకాలం కావడంతో గుంతలో నీళ్ల నిలిచి కనబడకుండా ఉండటంతో ఇప్పటికే చాలా మంది ద్విచక్రవాహనదారులు ప్రమాదవశాత్తు పడి గాయాలపాలవుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు దృష్టిసారించి రోడ్డు గుంతను పూడ్చి వేయాలని స్థానికులు, వాహనదారులు వేడుకుంటున్నారు.



నాంపల్లి చౌరస్తా వద్ద ప్రమాదకరంగా మారిన గుంత

దేవస్థానం పారిశుధ్య కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

సిరిసిల్ల టౌన్, జూన్ 28: వేములవాడ దేవస్థానం పారిశుధ్య కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, ప్రధాన కార్యదర్శి కడారి రాములు అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వేములవాడ దేవస్థానం పారిశుధ్య కార్మికులకు కాంట్రాక్టర్ ద్వారా కాకుండా దేవాదాయ శాఖ ద్వారా జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ప్రమాద భీమా సౌకర్యం కల్పించాలి, అదనపు పని గంటలకు అదనపు వేతనాలు చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో దేవాలయం ఈవో, కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెల్లడం జరిగిందన్నారు. కార్మికులకు ఐడీ కార్డులు, కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నేవూరి వెంకట్‌రెడ్డి వర్ధంతి

ఎల్లారెడ్డిపేట, జూన్ 28: మండల కేంద్రంలో సిరిసిల్ల సమితి మాజీ అధ్యక్షుడు, స్వర్గీయ నేవూరి వెంకట్‌రెడ్డి వర్ధంతిని స్థానికులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పశువుల సంత ఆవరణలో వెంకట్‌రెడ్డి చిత్రపటానికి ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. వెంకట్‌రెడ్డి విగ్రహాన్ని గ్రామంలో ఏర్పాటు చేయాలని కోరారు. మాజీ జడ్పీటీసీ వడ్నాల నర్సయ్య వెంకట్‌రెడ్డి విగ్రహానికి అయ్యే ఖర్చును భరిస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలోని పల్లె ప్రకృతి వనానికి వెంకట్‌రెడ్డి పేరు పెట్టాలని కోరుతూ స్థానిక పంచాయతీ కార్యదర్శి దేవరాజుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు అల్లం లక్ష్మణ్, ద్యాగం రాములు, రావుల మల్లారెడ్డి, కటుకం రామచంద్రం, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు గిరిధర్‌రెడ్డి, బాలరాజుయాదవ్, కిషన్, బాల్‌రెడ్డి, నర్సయ్య, లక్ష్మీనారాయణ, రాములు, లక్ష్మనర్సు, రాంరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

తహసీల్దార్ ఎదుట బైండోవర్

రాయికల్, జూన్ 28: మండలంలోని దావన్‌పెల్లి గ్రామానికి చెందిన గుడుంబా విక్రయిస్తూ పట్టుబడిన మాలోతు లక్ష్మి, ధర్మాజీపేటకు చెందిన లావుడ్య నాగరాజు, లావుడ్య గంగాధర్‌లను ఎక్సైజ్ సీఐ సర్వేశ్వర్ శుక్రవారం తహసీల్దార్ అబ్దుల్ ఖయ్యూం ఎదుట బైండోవర్ చేశారు. భవిష్యత్‌లో గుడుంబా తయారు చేస్తే రూ.లక్ష జరిమానా, జైలు శిక్ష పడుతుందని హెచ్చరించారు. ఎక్సైజ్ ఎస్సై రాజేందర్, కానిస్టేబుల్ మమత, అబ్దుల్లా ఉన్నారు.

ఇసుక వేలం వాయిదా

వెల్గటూర్, జూన్ 28: మండలంలోని స్తంభంపల్లి, పాషిగామ శివారు వ్యవసాయ భూమిలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుకను శుక్రవారం వేలం వేయాల్సి ఉండగా దానిని శనివారానికి వాయిదా వేసినట్లు తహసీల్దార్ శేఖర్ తెలిపారు. అక్రమ ఇసుక నిలువలను కలెక్టర్ సత్యప్రసాద్ పరిశీలించి వాటిని స్వాధీనం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 23న మైనింగ్, రెవెన్యూ, పోలీసు అధికారులు అక్రమ ఇసుక డంపులపై దాడులు నిర్వహించారు. స్తంభంపల్లి శివారులో ఎల్లమ్మ గుడి సమీపంలో నిలువ ఉంచిన 700 ట్రాక్టర్ ట్రిప్పులు, పాషిగామ శివారులో సుమారు 169 ట్రాక్టర్ ట్రిప్పుల అక్రమ ఇసుకను గుర్తించి పంచనామా నిర్వహించి స్వాధీనం చేసుకున్నారు. మెట్రిక్ టన్నుకు రూ.375గా నిర్ణయించి వేలం వేయాలని నిర్ణయించారు. వేలం పాటలో ఒకరు మాత్రమే పాల్గొనడంతో వాయిదా వేసినట్లు తహసీల్దార్ తెలిపారు. గ్రామస్తులే ఇసుక వేలం దక్కించుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది.